## క్లుప్తంగా

### నేత్రదానం


వెంకటమ్మ(ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన పగడాల వెంకటమ్మ(76) అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన అగర్వాల్ ఐ బ్యాంక్ సంస్థ రిప్రెసెంటేటివ్ జాని వెంకటమ్మ కుమారుడు పగడాల అశోక్‌రెడ్డితో మాట్లాడగా నేత్రదానంకు ఆయన అంగీకరించి నేత్రాలు దానం చేశారు. ఎవరైనా తమ కుటుంబసభ్యులు మృతి చెందితే వారి నేత్రాలను దానం చేయాలనుకుంటే వారు 7288084777 నంబర్‌ను సంప్రదించాలని సంస్థ బాధ్యుడు జానీ తెలిపారు.

### ఇసుక ర్యాంపును ప్రారంభించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నార్లపాటి శ్రీను

అశ్వారావుపేట: మండలంలోని గాండ్రాలలో ఇసుక ర్యాంపును ప్రారంభించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు అశ్వారావుపేటకు చెందిన నార్లపాటి శ్రీను, డేరంగుల ప్రసాద్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గతంలో ఉన్న ర్యాంపును ప్రభుత్వం మూసివేసినందున ఇసుక రవాణాకు ఇబ్బందిగా ఉందని.. కొందరు వ్యక్తులు మాత్రమే అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని, అండదండలు లేని వారిపై కేసులు పెడుతున్నారన్నారు.

### పరామర్శ


పరామర్శిస్తున్న రేగా కాంతారావు

మణుగూరు రూరల్ : మండలంలోని ఎక్సలెంట్ విద్యాసంస్థల చైర్మన్ ఎండి యూసఫ్ షరీఫ్ అనారోగ్యంతో బాధపడుతుండగా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పీవీ కాలనీలో యూసఫ్ షరీఫ్‌ను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, నాయకులు వట్టం రాంబాబు, శ్రీనివాస్, ముద్దంగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో వైద్య శిబిరాలు


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరు రూరల్: మండలంలోని గుండు సింగారం, వెంకటపతినగర్, రాయిగూడెం, వడ్డెర బజార్, దమ్మక్కపేట తదితర గ్రామాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆయా శిబిరాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం ఫ్రైడే డ్రైడే నిర్వహించి పరిసరాల పరిశీలించారు. నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, ప్రజలందరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### విగ్రహాలు పెట్టాలనే ఆలోచన విరమించుకోవాలి

అశ్వాపురం: మణుగూరు ఆర్‌అండ్‌బీ ప్రధాన కూడలిలో రాజకీయ నాయకుల విగ్రహాలు పెట్టాలనే ఆలోచనను విరమించుకోవాలని ఎంఆర్‌పీఎస్, మాదిగ జేఏసీ, ఎంఎస్‌పీ, మాల మహానాడు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అశ్వాపురంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మణుగూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో కొందరు రాజకీయ పార్టీల ప్రముఖులు వారి నాయకుల విగ్రహాలు పెట్టేందుకు పూనుకుంటున్నారని దళిత సంఘాల నాయకుల దృష్టికి వచ్చిందన్నారు. ఒక పార్టీ విగ్రహంతో మొదలై అనేక పార్టీల విగ్రహాలు నెలకోల్పేందుకు సన్నాహక చర్యలు నాయకులు చేసే అవకాశం ఉందన్నారు. ప్రధాన కూడలిలో విగ్రహం నెలకోల్పేందుకు ప్రయత్నిస్తే దళిత సంఘాల ఆధ్వర్యంలో ప్రతి ఘటిస్తామన్నారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు, నాయకులు ఇసంపల్లి కృష్ణ, గద్దల రామకృష్ణ, వల్లెపోగు వెంకటేశ్వర్లు, కాలువ సంసోన్, మేకల భాస్కర్, బొయిల్ల నరసింహారావు, చుంచు రామ్మూర్తి, భూక్యా చందూలాల్, గద్దల చైతన్య పాల్గొన్నారు.

# ‘మాఫీ’ కోసం ఎదురుచూపు

- రుణమాఫీ జరగక రైతన్నల అవస్థలు
- బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు


రుణమాఫీ వివరాలు ఆరా తీస్తున్న రైతులు

పినపాక: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ముఖ్యమైన హామీల్లో రుణమాఫీ ఒకటి. అధికారంలోకి రాగానే మొదటి విడతలో రూ.50 వేల నుండి రూ.లక్ష వరకు, రెండో విడతలో రూ.1,50,000 వరకు, మూడో విడతలో రెండు లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రకటించింది. కానీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పూర్తిస్థాయి రుణమాఫీ చేశామని ప్రకటించినప్పటికీ ఆచరణలోకి వచ్చేసరికి సాధ్యం కాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో రుణమాఫీ అవ్వక పలువురు రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.పదివేలు, రూ.50 వేలు రుణాలు కూడా మాఫీ కాని పరిస్థితిలో కొంతమంది ఉన్నారు.

మండలంలో మొదటి విడతలో 1,120 మందికి, రెండో విడతలో 794 మందికి, మూడో విడతలో సుమారు 600 మందికి రుణమాఫీ అయిందని అధికారులు చెబుతున్నారు. డీసీసీబీలోనే 2,012 మంది రైతుల రుణాలు తీసుకుంటే 653 మంది మాత్రమే మూడు విడతల్లో రుణమాఫీ అయ్యిందని తెలిపారు. అర్హత ఉన్నా రేషన్‌కార్డు లేక రుణమాఫీ కాలేదని పలువురు రైతులు వాపోతున్నారు. రుణమాఫీ కోసం ప్రదక్షిణలు చేస్తున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు వేడుకుంటున్నారు.

#### అర్హులందరికీ చేస్తాం..

రుణమాఫీ కానీ రైతులు వారి దగ్గరలో ఉన్న రైతువేదికల్లోని వ్యవసాయ శాఖ అధికారులకు పత్రాలను సమర్పిస్తే వాటిని పై అధికారులకు పంపించి రుణమాఫీ అయ్యేవిధంగా చూస్తాం. రుణాలు మాఫీ కానీ రైతుల వివరాలు సేకరిస్తున్నాం. వారికి కూడా రుణమాఫీ అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటాం. – వెంకటేశ్వర్లు, ఏఓ, పినపాక

#### రెండు బ్యాంకుల్లో మాఫీ కాలేదు



నేను రెండు బ్యాంకుల్లో డీసీసీబీలో రూ.45,000, ఎస్బీఐలో 30,000 వరకు రుణం తీసుకున్నాం. భార్యాభర్తల ఇద్దరు పేరుమీద లోను ఉండడంతో రుణమాఫీ కాలేదు అంటున్నారు. వేర్వేరు అకౌంట్లో రెండు లక్షలు లోపు మాత్రమే రుణాలు తీసుకున్నాం. అధికారులు స్పందించి రుణాలు మాఫీ చేయాలి.
– పోతురాజుల కనకయ్య, వెంకటరావుపేట

#### రేషన్ కార్డు లేదని...



నేను రూ.30,000 రుణం తీసుకున్నాను. మూడు విడతల్లో నాకు రుణమాఫీ అవ్వలేదు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే కంప్యూటర్లో చూసి నీకు రేషన్ కార్డు లేనందు వల్ల అని చూపిస్తుందన్నారు. ప్రభుత్వం రేషన్ కార్డు లేకుండా రుణాలు మాఫీ చేస్తున్నామని తెలిపిన నా రుణం మాఫీ కాలేదు.
– వెంకటేశ్వర రెడ్డి, బయ్యారం

#### పూర్తిస్థాయి జరగలేదు



డీసీసీబీలో మొత్తం 2,012 మంది రైతులు రుణాలు తీసుకోగా, మూడు విడతల్లో 653 మందికి మాఫీ అయింది. మిగతా రైతులు సొసైటీ, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయి రుణమాఫీ అని చెప్పి అరకొర రుణాలు మాఫీ చేసి రైతులను మభ్యపెడుతుంది. ప్రభుత్వం పూర్తిస్థాయి రుణమాఫీ చేయాలి. – రవి శేఖర్ వర్మ, సొసైటీ చైర్మన్

# క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం, డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు రూరల్: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు పడతాయని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పాత ఏరియా స్టోర్స్ వద్ద క్రీడా మైదానంలో గంట్ల కోటేశ్వరరావు జ్ఞాపకార్థంగా గంట్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. .క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి, స్నేహభావం పెంపొందేందుకు దోహదపడతాయన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో, విద్యలో రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, రెండింటిని సమానంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలన్నారు. ఎన్నో క్రీడాపోటీలకు వేదిక అవుతున్న క్రీడామైదానం గురించి కలెక్టర్, సింగరేణి ఏరియా జీఎం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, రిటైర్డ్ ఏఎస్సై రాంబాబు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పీరినాకి నవీన్, సామా శ్రీనివాస్‌రెడ్డి, పల్లపు తిరుమలేష్, మధు, శ్రీనివాస్, వెంకన్న, కనకయ్య, గుడిపూడి కోటేశ్వరరావు, ఆవుల సర్వేశ్వరరావు, గాండ్ల సురేష్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిక**

మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీలో మాజీ సర్పంచ్ తాటి భిక్షం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో 60 కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే పాయం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, ఆవుల సర్వేశ్వరరావు, పల్లపు తిరుమలేష్, సురేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 15లోగా పనులు పూర్తి చేయాలి

- ‘ఏకలవ్య’ పనుల్లో జాప్యంపై ఎమ్మెల్యే జారె ఆగ్రహం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

ములకలపల్లి : ‘ఈనెల 15లోగా పనులు పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి. లేకుంటే పనుల నుండి తప్పుకోండి’ అంటూ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని మూకమామిడి ప్రాజెక్ట్ సమీపంలో రూ.35 కోట్ల వ్యయంతో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. నత్తనడకన సాగుతున్న పనులపై హెచ్చరించారు. సెప్టెంబరు 2లోగా పనులు పూర్తి చేస్తామని గతంలో చెప్పారని, నేటికీ ఎందుకు పూర్తికాలేదని కాంట్రాక్టర్లను ప్రశ్నించారు. మరో రెండు నెలల వ్యవధి కావాలంటూ తెలపడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అంకంపాలెంలోని ఇరుకు గదుల్లో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలంటూ ఐదు నెలల వ్యవధిలో పలుమార్లు సందర్శించినా ఫలితంలేకుండా పోయిందన్నారు. దసరా సెలవులు అనంతరం తానే విద్యార్థులతో పాఠశాలకు వస్తానని, అప్పటికి 250 మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉండేలా ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, కారం సుధీర్, తాటి తులసి, సున్నం సునిత, శనగపాటి రవి, మిరియాల అవినాష్, పిడియాల బుజ్జి, గిరి సురభి రాజేశ్, పాలకుర్తి సుమిత్, కటికనేని ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా వివరాలు సేకరించాలి


సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ దామోదర్‌రావు

భద్రాచలంఅర్బన్: ఎలాంటి తప్పులు దొర్లకుండా వివరాలను పకడ్బందీగా సేకరించాలని భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు సర్వే సిబ్బందికి సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సంబంధించిన క్షేత్రస్థాయి సర్వే పైలట్ ప్రాజెక్టులో భాగంగా భద్రాచలం పట్టణంలోని రెండో బ్లాక్‌లోని కొత్తపేట కాలనీలో 280 కుటుంబాలను ఎంపిక చేశారు. దీంతో నాలుగు బృందాలు సదరు కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమచారాన్ని సేకరిస్తున్నారు. ఈ మేరకు ఈ మేరకు శుక్రవారం కొత్తపేటలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని ఆర్డీఓ దామోదర్ రావు స్వయంగా పరిశీలించి, కాలనీ వాసులతో మాట్లాడి వివరాల సేకరణ తీరును ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఫోన్లలో కుటుంబ సభ్యుల ఫొటోలు సేకరించి, ఆన్‌లైన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాసరావు, రెవెన్యూ ఆర్ఐ నరసింహారావు, గ్రామ పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### కార్మికుల పక్షాన పోరాటం

భద్రాచలంఅర్బన్: జీసీసీ కార్మికుల సమస్యలపై పోరాడేది ఒక సీఐటీయూ మాత్రమే అని సంఘం పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి స్పష్టం చేశారు. వేతన ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా శుక్రవారం జీసీసీ హమాలీ కార్మికులు సంబురాలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కార్మికులు అనేక ఏళ్ల తరబడి ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగా కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించబడిందన్నారు. సుబ్రహ్మణ్యం, ప్రసాద్, లోకేష్, ముక్తేశ్వరరావు, శేషు, కుమారు, తదితరులు పాల్గొన్నారు.

### టవర్ నిర్మాణం నిలిపివేత

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని జగదటిష్ కాలనీలో జరుగుతున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని శుక్రవారం నిలిపివేశారు. కాలనీలో టవర్ నిర్మాణం ఆపివేయాలని స్థానికులు నిరసన తెలిపారు. అధికారులకు వినతిపత్రాలకు అందజేశారు. నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని పంచాయతీ ఈవో శ్రీనివాసరావు పరిశీలించి, సామాగ్రిని తరలించి, సదరు ప్రాంతంలో సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టవద్దని హెచ్చరించారు.


సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

### ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

మణుగూరు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదలకు నష్టపోయిన ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు జిల్లా ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రఫీ సహకారంతో ఆర్థిక సాయం అందించారు. అసోసియేషన్‌లో శాశ్వత సభ్యత్వం కలిగిన ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేల చొప్పున నాలుగు కుటుంబాలకు అందజేశారు. అనంతరం మహమ్మద్ రఫీ మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తుల వల్ల జరిగే నష్టాలకు ఎదుర్కొని నిలబడాలని, బాధిత ఫొటోగ్రాఫర్లందరికీ సహకారం అందించి ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కీసర సుధాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు వనం కృష్ణమోహన్, కార్యదర్శి పుసులూరి శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్, భూపాలపల్లి జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, శాశ్వత సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

మణుగూరు టౌన్: ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకాల్లో అవినీతికి పాల్పడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టి ఉపాధి కోల్పోయిన వార్డ్ బాయ్‌లతో పాటు పీడీఎఫ్‌లకు న్యాయం చేయాలని అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జీఎం దుర్గం రాంచందర్‌కి వినతిపత్రం అందజేశారు. ఏరియా అఖిల లక్ష కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, బీఎంఎస్, ఇఫ్టూ నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోస్టుల భర్తీకి అర్హత ఉన్న అభ్యర్థులకు పరుగుపందెం పోటీలు నిర్వహించగా తొమ్మిది నెలలుగా ఆశావహులు ఉపాధి కోసం తిరుగుతూనే ఉన్నారన్నారు. ఈ విషయంపై ఏరియా అధికారులు సీరియస్‌గా స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదర్ల సురేందర్, వత్సవాయి కృష్ణంరాజు, సిల్వేరు గట్టయ్య, వెంకటరత్నం, కొడిపల్లి శ్రీలత, భుక్యా కిషన్, నాజర్‌పాషా, అంగోత్ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా మట్టి తవ్వకం


సీతారామ కాలువ వద్ద మట్టి తవ్విన దృశ్యం

ములకలపల్లి: ‘సీతారామ’ ప్రాజెక్ట్ కాల్వ మట్టి అక్రమార్కుల పాలవుతోంది. కాల్వ పటిష్టతకు వేసిన నాణ్యమైన మట్టి గ్రావెల్ అర్ధరాత్రి వేళ యథేచ్ఛగా బైటికి తరలిస్తున్నారు. సత్యంపేట, రామాంజనేయపురం శివారులోని సీతారామ ప్రాజెక్ట్ ఎస్కేప్ సమీపంలో ఈ దందా అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. జేసీబీతో లారీలో లోడు చేసుకొని దర్జాగా బైటికి తోలుతున్నారు. ప్రతీ రాత్రి పదుల సంఖ్యలో గమ్యానికి చేరుస్తున్నట్టు సమాచారం. మట్టి మాఫియా ఇష్టారీతిన మట్టి దందా చేస్తున్నా సీతారామ ప్రాజెక్ట్, నీటిపారుదల శాఖ అధికారులెవరూ దృష్టి సారించకపోవడం గమనార్హం.

# తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతిరూపం


ములకలపల్లి: బతుకమ్మలతో ఎమ్మెల్యే జారె, అధికారులు

కరకగూడెం: తెలంగాణ సంస్కృతికి నిదర్శనం బతుకమ్మ పండుగ అని కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక పీహెచ్ సీలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పినపాక ప్రభుత్వ వైద్యాధికారిణి దుర్గాభవాని, హెచ్ఈఓ కృష్ణయ్య, ఆరోగ్య సహాయకులు కృష్ణా, నరసింహా, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 108 సిబ్బంది పాల్గొన్నారు.

ములకలపల్లి: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సరదాగా కాసేపు బతుకమ్మలాడారు. ముత్యాలంపాడు గ్రామంలో జరుగుతున్న డిజిటల్ కార్డు సర్వేకి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బతుకమ్మ వద్ద ప్రత్యేక పూజలు చేసిన మహిళలు, అధికారులతో కలసి ఆటపాటలతో బతుకమ్మ ఆడారు.

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ చిన్యా ఆధ్వర్యంలో విద్యార్థినులు బతుకమ్మ సంబురాల్లో ఆడిపాడారు. అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.


కరకగూడెం: పీహెచ్‌సీలో..


బూర్గంపాడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

# అమ్మవారికి ప్రత్యేక పూజలు


దుమ్ముగూడెం: మహాలక్ష్మి అవతారంలో..


కరకగూడెం: పూజల్లో పాల్గొన్న అర్చకులు, భక్తులు


భద్రాచలంటౌన్: గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పలు సెంటర్లు, ఆలయాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద రెండవ రోజు శుక్రవారం అమ్మవారు భక్తులకు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చింది. వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం(శ్రీరంగాపురం) గ్రామంలో శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో, అదేవిధంగా పలు గ్రామాల్లో అమ్మవారు భక్తులకు గాయత్రీ దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. అర్చకుల సమక్షంలో వివిధ రకాల పూజలు, నైవేద్యాలు సమర్పించారు.

కరకగూడెం: మండలంలోని రాళ్లవాగు వద్ద గల శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద దేవీ శరన్నవరాత్రుల్లో భక్తులకు అమ్మవారు వేదమాత గాయత్రీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు ఉల్లి నర్సింహాచార్యులు పూజలు నిర్వహించారు.

**మహాలక్ష్మి అవతారంలో..**

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన నిర్వహించారు. ప్రధానార్చకులు శేషం కిరణ్ కుమారాచార్యులు, నరసింహాచార్యులు, శ్రీరంగం వెంకటాచార్యులు, ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


మణుగూరు టౌన్: శోభాయాత్ర ..

**ఘనంగా శోభాయాత్ర**

మణుగూరు టౌన్: అశ్వాపురం ఓం పరాశక్తి దేవాలయం ఆధ్వర్యంలో మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని భవానీ మాలధారులు పాల్గొని నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... రెండో రోజు గాయత్రీ దేవి అలంకరణను పురస్కరించుకుని ప్రతీ ఏటా శోభాయాత్ర నిర్వహించడం ఆనవాయితీ అన్నారు.


అశ్వారావుపేటరూరల్: గాయత్రీదేవి అలంకారంలో..